14-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్మృతి యొక్క అభ్యాసాన్ని సహజం చేసుకునేందుకు తండ్రిని కొన్ని సార్లు తండ్రి రూపంలో, కొన్ని సార్లు టీచర్ రూపంలో, మరి కొన్ని సార్లు సద్గురువు రూపంలో స్మృతి చేయండి"

ప్రశ్న:- పిల్లలైన మీరు ఇప్పుడు మొత్తం విశ్వమంతటిలోనూ ఏ దండోరాను మ్రోగించాలి?

జవాబు:- ఇప్పుడు దండోరా మ్రోగించండి - సుఖమయ ప్రపంచమైన స్వర్గ రచయిత స్వయంగా రాజయోగాన్ని నేర్పించేందుకు వచ్చారు. వారు పిల్లల కోసం అరచేతిలో వైకుంఠాన్ని తీసుకువచ్చారు, అందుకే రాజయోగాన్ని నేర్చుకోండి. తండ్రి స్వయంగా చెప్తున్నారు - పిల్లలూ, ఇప్పుడు మీ 84 జన్మలూ పూర్తయ్యాయి, మీరు నాతోపాటు ఇంటికి రావాలి, అందుకే దేహ భానాన్ని వదిలి అశరీరిగా అవ్వండి. దైవీ గుణాలను ధారణ చేసినట్లయితే దైవీ ప్రపంచములోకి వెళ్ళిపోతారు.

పాట:- నా మనస్సు అనే ద్వారము వద్దకు ఎవరు వచ్చారు... (కౌన్ ఆయా మేరే మన్ కే ద్వారే...)

ఓంశాంతి. మధురాతి-మధురమైన పిల్లలు పాటను విన్నారు, ఇప్పుడు మన బుద్ధిలోకి ఎవరి స్మృతి వచ్చింది? పతిత-పావనుడు ఒక్క తండ్రేనని అందరి బుద్ధిలోనూ ఉంది. ఇంగ్లీష్ లో వారిని లిబరేటర్ (ముక్తిప్రదాత) అని అంటారు. వారు దుఃఖం నుండి విముక్తులుగా చేస్తారు. వారు దుఃఖహర్త-సుఖకర్త, ఇది మనుష్యులు లేక దేవతల పేరేమీ కాదు. ఇది ఒక్క పతిత-పావనుడైన తండ్రి మహిమయే. పతిత-పావనుడు, సద్గతిదాత అని గాడ్ ఫాదర్ నే అంటారు. ఈ మహిమ మనుష్యులకు ఉండదు. లక్ష్మీ-నారాయణులను, బ్రహ్మ-విష్ణు-శంకరులను పతిత-పావనులు అని అనరు. పతిత-పావనుడు, ఉన్నతోన్నతమైనవారు ఒక్కరే. పరమపిత పరమాత్మ విషయంలో - వారి పేరు కూడా ఉన్నతమైనదే, వారి నివాస స్థానము కూడా ఉన్నతమైనదే. వీరు మన బాబా అని మీకు నిశ్చయము ఉంది. శివుడినే బాబా అని అంటారు, శివుడే నిరాకారుడు. శివుని చిత్రము వేరు, శంకరుని చిత్రము వేరు. శివుడు తండ్రి, శిక్షకుడు, సద్గురువు. ఈ రోజు సద్గురువారము. మీకైతే ప్రతిరోజూ సద్గురువారమే. సద్గురువు రోజూ మిమ్మల్ని చదివిస్తారు మరియు వారు మీకు తండ్రి కూడా, ఈ నిశ్చయమైతే ఉండాలి కదా. వారిని సర్వవ్యాపి అని అనరు. పతిత-పావనుడైన పరమపిత పరమాత్మ మాకు రాజయోగాన్ని నేర్పిస్తారని, వారు జ్ఞానసాగరుడని మీ బుద్ధిలో ఉంది. బుద్ధిలో ఈ నిశ్చయం ఉండాలి. ఈ తండ్రి ఒక్కరినే మీరు ఏ రూపంలోనైనా స్మృతి చేయవచ్చు. బుద్ధి పైకి, నిరాకారుని వైపుకు వెళ్ళిపోతుంది. వారు ఆకారుడు లేక సాకారుడు కాదు. ఆత్మలకు పరమపిత పరమాత్మతో ఇప్పుడు అవసరం పడింది కానీ వారి గురించి తెలియదు. వారు జ్ఞానసాగరుడు అని గానం చేస్తారు. జ్ఞానసాగరుడు అనగా జ్ఞానాన్ని వినిపించి సద్గతిని ఇచ్చేవారు. లక్ష్మీ-నారాయణులకు ఈ జ్ఞానము లేదు. ఏ జ్ఞానమైతే జ్ఞాన సాగరుడి నుండి లభిస్తుందో అదే జ్ఞానము, కావుననే శాస్త్రాలలో ఉన్నది కూడా జ్ఞానము కాదు. జ్ఞాన సాగరుడినే మనుష్య సృష్టికి బీజరూపుడు అని అంటారు. తండ్రి రచయిత. వారు అనంతమైన తండ్రి, మిగిలినవారంతా హద్దు తండ్రులు. ఇప్పుడు అనంతమైన తండ్రిని అందరూ తలచుకుంటారు, వారు తండ్రులకే తండ్రి, పతులకే పతి, గురువులకే గురువు, అందరూ వారినే తలచుకుంటారు, సాధన చేస్తారు. ఈ రోజుల్లో చిత్రాల ఎదురుగా, రాముని ఎదురుగా, శంకరుని ఎదురుగా లింగాన్ని ఉంచుతారు. వారు నిరాకారుడు, ఉన్నతోన్నతమైనవారు, వారే విముక్తులుగా చేస్తారు. ఇప్పుడు ఆత్మలందరూ పతితులుగా ఉన్నారు. 5,000 సంవత్సరాల క్రితం ఎప్పుడైతే ఆది సనాతన దేవీ-దేవతల రాజ్యం ఉండేదో, అప్పుడు ఆ సమయంలో ఒకే రాజ్యము ఉండేది, సుఖధామము ఉండేది. పవిత్రత, సుఖ-శాంతులు అన్నీ ఉండేవి. దాని పేరే స్వర్గము, హెవెన్. స్వర్గాన్ని సూక్ష్మవతనము లేక మూలవతనము అని అనరు. స్వర్గానికి వ్యతిరేకంగా ఉండేది నరకము. ఈ విషయాన్ని బుద్ధిలో ఉంచుకోవాలి. ఒక్క అనంతమైన తండ్రినే స్మృతి చేయాలి, వారి నుండి స్వర్గ వారసత్వం లభిస్తుంది.

సద్గురువు రాజయోగాన్ని నేర్పిస్తారు, పావన ప్రపంచములోకి తీసుకువెళ్తారు. ఆ ఒక్కరికి ఎంతటి మహిమ ఉంది. లక్ష్మీ-నారాయణులకు ఈ మహిమను ఇవ్వలేరు. నిరాకార తండ్రి ఒక్కరే. ఆత్మలు కూడా శరీరం నుండి వేరుగా ఉన్నప్పుడు నిరాకారిగానే ఉంటాయి. తండ్రి అంటారు, మీరు మీ శరీరాన్ని తీసుకొని పాత్రను అభినయిస్తారు. మీరు ఎన్ని జన్మలు పాత్రను అభినయిస్తారు, ఇది కూడా మీకు తెలుసు. బ్రహ్మకు కూడా శరీరము ఉంది. సూక్ష్మవతనములో కూడా శరీరము ఉంది. శరీరమైతే ఉంటుంది కదా. వారిలో కూడా ఆత్మ ఉంది అని అంటారు. బ్రహ్మ,

విష్ణు, శంకరులకు కూడా సూక్ష్మ శరీరాలు ఉన్నాయి. నన్ను నిరాకారుడు అని అంటారు. పిల్లలకు అర్థం చేయించడం జరిగింది - మీకు ఇద్దరు తండ్రులు ఉన్నారు, అలాగే మీ తండ్రికి కూడా ఇద్దరు తండ్రులు ఉన్నారు అని ఎవరికైనా చెప్పండి. అందరూ ఆ అనంతమైన తండ్రినే తలచుకుంటారు. లౌకిక తండ్రులు అనేకమంది ఉన్నారు, ఈ అనంతమైన తండ్రి అయితే ఒక్కరే ఉన్నారు. తండ్రిని మర్చిపోతే టీచర్ గుర్తుకు రావాలి, టీచర్ ను మర్చిపోతే సద్గురువు గుర్తుకు రావాలి.

తండ్రి అర్థం చేయిస్తారు, భారత్ ఇప్పుడు పతితముగా ఉంది. మొదట పావనంగా ఉండేది, మరి ఆ సమయంలో ఇంతమంది ఆత్మలు ఎక్కడ నివసిస్తూ ఉండి ఉంటారు? ముక్తిధామములో, వానప్రస్థావస్థలో ఉండేవారు అనగా వాణి నుండి అతీతముగా ఉండేవారు. మనుష్యులు వృద్ధులైనప్పుడు వాణి నుండి అతీతముగా వెళ్ళేందుకు - మమ్మల్ని నిర్వాణధామానికి చేర్చండి అని గురువు శరణును తీసుకుంటారు, కానీ వారు చేర్చలేరు. వృక్షమైతే వృద్ధి చెందాల్సిందే. ముఖ్యమైన పాత్ర భారత్ ది, అందులోనూ ఎవరైతే ఆది సనాతన దేవీ-దేవతా ధర్మానికి చెందినవారు ఉంటారో, వారే 84 జన్మలు తీసుకుంటారు. ఆత్మ, పరమాత్మ చాలా కాలం వేరుగా ఉన్నారు... అని అంటారు, మరి లెక్క కావాలి కదా. చాలా కాలం వేరుగా ఉన్నారు అనగా ఎవరైతే మొట్టమొదట ఈ సృష్టిపైకి పాత్రను అభినయించడానికి వస్తారో వారు. తప్పకుండా 84 జన్మలు వారివే. 84 జన్మల చక్రము అని అంటారు, 84 లక్షల జన్మల చక్రము అని అనరు. పిల్లలైన మీకు 84 జన్మల చక్రము గురించి అర్థం చేయించడం జరిగింది, ఇంతకుముందు దీని గురించి తెలియదు. వీరిని అడిగినా వీరి ఆత్మకు కూడా తెలుసు కదా. రెండు ఆత్మల రహస్యాన్ని కూడా అర్థం చేయించారు. మరొక ఆత్మ ప్రవేశించగలదు. అశుద్ధ ఆత్మ కూడా ప్రవేశించగలదు. అదే విధంగా పరమపిత పరమాత్మ కూడా రాగలరు. వారంటారు - నిరాకారుడినైన నేను రాకపోతే రాజయోగాన్ని ఎలా నేర్పించాలి? నన్నే జ్ఞానసాగరుడు అని అంటారు, మనుష్యులైతే స్వర్గ స్థాపన చేయలేరు కదా. తండ్రినే హెవెన్లీ గాడ్ ఫాదర్ అని అంటారు. వైకుంఠ రాజధాని ఉంటుంది. ఒక్కరే అయితే ఉండరు కదా. శ్రీకృష్ణుడు నంబరువన్ రాకుమారుడు, సతోప్రధానమైనవారు. సతోప్రధానమైనవారినే మహాత్మ అని అంటారు. ఒంటరిగా ఉన్నవారిని కుమార్, కుమారీ అని అంటారు. కుమారీలకు ఎంతో గౌరవము ఉంటుంది. నిశ్చితార్థం జరిగిన తర్వాత, ఒకవేళ పవిత్రంగా ఉన్నా కూడా యుగళులు అయినట్లే కదా, ఆ తర్వాత కుమారీ పేరు మారిపోతుంది, ఆ తర్వాత మాతా-పితలుగా అవుతారు. బిడ్డ జన్మిస్తే మాతా-పిత అని పిలవబడతారు. వివాహం తర్వాత - వీరు మాతా-పిత అని భావిస్తారు, సంతానము కూడా ఉంటుంది అన్నది అర్థమవుతుంది. అప్పుడిక వారిని కుమార్, కుమారీ అని అనరు.

పిల్లలైన మీకు తెలుసు - ఇప్పుడు శ్రీకృష్ణపురి స్థాపనవుతుంది. అక్కడ ఒక్క దేవీ-దేవతా ధర్మమే ఉంటుంది. ఇకపోతే ప్రతి ఒక్క ధర్మము యొక్క శాస్త్రము వేర్వేరుగా ఉంటుంది. ఫలానా వారి ధర్మశాస్త్రము ఇది, మేము ఫలానా ధర్మంలోకి లేక మతానికి వెళ్ళాము అని అంటారు. ఆత్మలు వచ్చి తమ పాత్రను అభినయించాలి. గురునానక్ మళ్ళీ ఎప్పుడు వస్తారు అని ఎవరినైనా అడిగితే, జ్యోతి జ్యోతిలో కలిసిపోయింది అని వారు అంటారు. అంటే వారు మళ్ళీ వచ్చేది లేదా? అలాగైతే సృష్టి చక్రం ఎలా రిపీట్ అవుతుంది? గురునానక్ ఆత్మ ఎప్పుడైతే వస్తుందో అప్పుడు అతని వెనుక సిక్కు ధర్మం వారు కూడా వస్తూ ఉంటారు. ఇప్పుడు ఎంతమంది తయారయ్యారో చూడండి! ఇది రిపీట్ అవుతుంది కదా. వారు మళ్ళీ ఎప్పుడు వస్తారో చెప్పండి? అని అడిగితే వారు చెప్పలేకపోతారు. మీరు అంటారు - ఇది 5000 సంవత్సరముల చక్రము, గురునానక్ వచ్చి 500 సంవత్సరాలు అయ్యింది, మళ్ళీ 4500 సంవత్సరాల తర్వాత వచ్చి సిక్కు ధర్మాన్ని స్థాపన చేస్తారు. నేను ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేస్తాను. ఆ తర్వాత మిగిలినవారు కూడా నంబరువారుగా వచ్చి ధర్మ స్థాపన చేస్తారు. మా బుద్ధిలో ఇన్ని విషయాలు కూర్చోవు అని కొందరు పిల్లలు అంటారు. అచ్ఛా, కొన్ని విషయాలైతే కూర్చుంటాయి కదా. భక్తుల భగవంతుడు ఒక్క తండ్రియే. పాప ఆత్మ, పుణ్య ఆత్మ అని కూడా అంటారు. పరమాత్మ అని ఎవ్వరినీ అనరు. ఆత్మ వెళ్ళి పరమాత్మగా అవుతుంది అని కాదు. నీటి బుడగ సాగరములో లీనమైపోతుంది అని ఉదాహరణ ఇస్తారు కదా. కొందరు అతీతంగా నిర్వాణానికి వెళ్ళిపోయారు అని అంటారు. బుద్ధుడి గురించి అలా చెప్తారు. కొందరేమో జ్యోతి జ్యోతిలో కలిసిపోయింది అని అంటారు. మరి ఇంతకీ రైట్ ఎవరు? నిర్వాణానికి వెళ్ళడం అన్నది సరైనదే. ఆత్మ కూడా నిరాకారియే. నిరాకారీ ప్రపంచంలో ఉంటుంది. సూక్ష్మవతనంలో మూవీ ఉంటుంది. అది కూడా అక్కడ ఉండేటువంటి ఒక భాష వంటిది, దానిని అక్కడ వారు అర్థం చేసుకుంటారు, అర్థం చేసుకుని డైరెక్షన్లను తీసుకువస్తారు. ఇది కూడా అద్భుతమైన విషయమే కదా. మూవీ, టాకీ మరియు సైలెన్స్ - మూడు ఉన్నాయి. పూర్వము సినిమాలు కూడా మూవీ ఉండేవి (మాటలు లేకుండా). ఆ తర్వాత వాటితో ఎవరికీ అంత ఆనందం కలగకపోయేటప్పటికి టాకీగా చేసారు. సూక్ష్మవతనములో కేవలం బ్రహ్మ, విష్ణు,

శంకరులు ఉంటారు. ఉన్నతోన్నతమైనవారు పరమపిత పరమాత్మ అని, వారు సైలెన్స్ వరల్డ్ (నిర్వాణధామం)లో ఉంటారని అర్థం చేయించడం జరుగుతుంది. ఆత్మలమైన మనం కూడా అక్కడే ఉంటాము. పతిత-పావనుడు సద్గురువు ఒక్కరే. సర్వుల సద్గతిదాత వారే. మిగిలినవారు స్వయాన్ని గురువులుగా చెప్పుకున్నా, ఋషులుగా చెప్పుకున్నా, మహాత్ములుగా చెప్పుకున్నా, అందరూ భక్తులే. పావనంగా తయారుచేసేవారి గురించి తెలియనే తెలియదు.

పరమాత్మ అందరినీ సమాధి నుండి బయటకు తీసి తమతోపాటు తీసుకువెళ్తారు అని అంటారు. ఇది అదే మహాభారీ మహాభారత యుద్ధం అన్నది మీరు చూస్తారు కూడా. మీరు సత్యయుగము కొరకు రాజయోగాన్ని నేర్చుకుంటున్నారు. వినాశనం తర్వాత మళ్ళీ సత్యయుగ ద్వారాలు తెరుచుకుంటాయి. తండ్రి అర్థం చేయించారు, ఈ సమయంలో మీరు తండ్రి నుండి రాజయోగాన్ని నేర్చుకుంటారు. మీరు యోగబలం ద్వారా రాజ్యాన్ని తీసుకుంటారు. ఇది అహింసాయుతమైనది. అహింస అని దేనిని అంటారో ఎవ్వరికీ తెలియదు. కామ ఖడ్గాన్ని కూడా ఉపయోగించకూడదు, ఇది కూడా హింసయే. అహింసా పరమో దేవీ-దేవతా ధర్మముగా ఉండేది. వికారాల కారణముగానే మీరు ఆదిమధ్యాంతాలు దుఃఖాన్ని పొందారు. అక్కడ ఉండేదే నిర్వికారీ ప్రపంచము, ఆ కారణముగా ఆదిమధ్యాంతాలు దుఃఖము ఉండదు. అది అమరలోకము, ఇది మృత్యులోకము. అమరలోకములోకి వెళ్ళేందుకు మృత్యులోకములో కూర్చొని కథను వినిపిస్తారు. తండ్రి అంటారు, నేను త్రికాలదర్శిని, మిమ్మల్ని కూడా త్రికాలదర్శులుగా, త్రినేత్రులుగా తయారుచేస్తాను అనగా మూడు లోకాల గురించి, మూడు కాలాల గురించి తెలిసినవారిగా తయారుచేస్తాను. ఇది భగవంతుని మహిమ. పిల్లలైన మిమ్మల్ని తమ సమానముగా తయారుచేసి తమతోపాటు తీసుకువెళ్తారు. జ్ఞాన సాగరుని పిల్లలైన మీరు కూడా మాస్టర్ జ్ఞాన సాగరులుగా అవుతారు. తండ్రి అంటారు, నేను మనుష్య సృష్టికి బీజరూపుడను, చైతన్యమును, జ్ఞాన సాగరుడను. బీజము నుండి వృక్షము వెలువడుతుందని, ఆ తర్వాత ఫలము వెలువడుతుందని మనకు అర్థమవుతుంది. ఇప్పుడు ఇది మనుష్య సృష్టి రూపీ వృక్షము. బాబా అంటారు, నేను ఈ తలక్రిందుల వృక్షం యొక్క ఆదిమధ్యాంతాల గురించి, సృష్టి చక్రము గురించి తెలిసినవాడిని. పరమాత్మ సత్యము, చైతన్యము, ఆనంద సాగరుడు, సుఖ సాగరుడు, కావున వారి నుండి తప్పకుండా వారసత్వం లభించాలి అని మనుష్యులు అంటారు. మీరు మీ తండ్రినైన నా నుండి వారసత్వాన్ని తీసుకుంటున్నారు. మీరు 21 జన్మల కొరకు పావనంగా అవుతారు. నేను సదా పావనుడను. మీరైతే పాత్రను అభినయించాలి. ఈ సమయంలో కేవలం మీది మాత్రమే ఎక్కే కళ. మీరు మాస్టర్ జ్ఞాన సాగరులుగా అవుతారు. మళ్ళీ సత్యయుగము నుండి మొదలుకుని మీ కళలు తగ్గుతూ ఉంటాయి. పైకి ఎక్కి మళ్ళీ కిందకు దిగవలసిందే. ఇప్పుడు పిల్లలైన మీరు అనంతమైన తండ్రి నుండి అనంతమైన వారసత్వాన్ని తీసుకుంటారు. ఎంతో సేవను చేస్తారు. తండ్రి పతిత-పావనుడు. మీరు శివశక్తి పాండవ సైన్యము. పతిత ప్రపంచాన్ని పావన ప్రపంచంగా తయారుచేయడంలో మీరు సహాయం చేస్తారు. మిమ్మల్నే వందేమాతరం అని అంటారు. పతితులను ఎప్పుడూ వందేమాతరం అని అనరు. తండ్రి వచ్చి శక్తి దళము ద్వారా గుప్తమైన సేవను చేయిస్తారు. మీరు డబుల్ అహింసకులు. రాజ్యాన్ని తీసుకుంటారు కానీ ఆయుధాలు మొదలైనవేవీ లేవు. మీరు పవిత్రముగా ఉంటారు. వారందరూ డబుల్ హింసకులు. ఒకటేమో వికారాలలోకి వెళ్తారు, కామ ఖడ్గాన్ని ఉపయోగించి ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటారు మరియు పరస్పరం గొడవపడుతూ-పోట్లాడుకుంటూ కూడా ఉంటారు. ఈ రోజుల్లో ఎన్ని దుఃఖపు పర్వతాలు పడుతున్నాయి. మనుష్యులలో క్రోధము ఎంత ఎక్కువగా ఉంది. తమను తామే చెంపదెబ్బ వేసుకుంటారు, అందరినీ నింద చేస్తూ ఉంటారు. ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. అందరూ కింద పడవలసిందే. ఇప్పుడు మీది పైకి ఎక్కే కళ. స్వర్గ రచయిత, రాజయోగాన్ని నేర్పించే ఆ భగవంతుడు వచ్చారు అని మీరు దండోరా వేయించండి. వారు అరచేతిలో వైకుంఠాన్ని తీసుకువచ్చారు. శ్రీకృష్ణుడిని మనం భగవంతుడు అని అనము, వారు దైవీ గుణాలు కల మానవుడు. బ్రహ్మ, విష్ణు, శంకరులను దేవతలు అని అంటారు, వారిని దైవీ గుణాలు కల మనుష్యులు అని అనరు. దైవీ గుణాలు సత్యయుగీ మనుష్యులలో ఉంటాయి, అసురీ గుణాలు కలియుగీ మనుష్యులలో ఉంటాయి. దైవీ గుణవంతులుగా మరియు అసురీ గుణవంతులుగా మనుష్యులే అవుతారు. తండ్రి కూర్చొని అర్థం చేయిస్తున్నారు - మీరు తండ్రిని ఎందుకు మరిచిపోతున్నారు? ఘడియ-ఘడియా నన్ను స్మృతి చేయండి. మీ 84 జన్మలూ పూర్తయ్యాయి, ఇప్పుడు నేను మీకు రాజయోగాన్ని నేర్పించేందుకు వచ్చాను. అయినా మీరు ఘడియ-ఘడియా మర్చిపోతున్నారు. దేహాభిమానాన్ని వదిలి స్వయాన్ని అశరీరిగా భావించండి.

అచ్ఛా! మాత-పిత బాప్ దాదాల మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్.

ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. తండ్రి సమానంగా త్రికాలదర్శులుగా, త్రినేత్రులుగా, త్రిలోకీనాథులుగా అవ్వాలి. తండ్రి మహిమలో స్వయాన్ని మాస్టర్లుగా తయారుచేసుకోవాలి.

2. డబుల్ అహింసకులుగా అవ్వాలి. ఏ వికారానికీ వశీభూతులై హింసను చేయకూడదు. తండ్రికి సహాయకులుగా అయి అందరినీ పావనంగా తయారుచేసే సేవను చేయాలి.

వరదానము:- జ్వాలా రూపీ స్మృతి ద్వారా స్వయాన్ని పరివర్తన చేసుకుని బ్రాహ్మణుల నుండి ఫరిశ్తాలుగా, ఫరిశ్తాల నుండి దేవతలుగా కండి

ఏ విధంగానైతే అగ్నిలో ఏదైనా వస్తువును వేసినప్పుడు దాని నామం, రూపం, గుణం, అన్నీ మారిపోతాయో, అదే విధంగా తండ్రి యొక్క స్మృతి రూపీ లగనము అనే అగ్నిలో పడినట్లయితే పరివర్తన అయిపోతారు. మనుష్యుల నుండి బ్రాహ్మణులుగా, మళ్ళీ బ్రాహ్మణుల నుండి ఫరిశ్తాలుగా, ఫరిశ్తాల నుండి దేవతలుగా అవుతారు. ఎలాగైతే పచ్చి మట్టిని అచ్చులో వేసి దానిని అగ్నిలో ఉంచినప్పుడు అది ఇటుకగా మారుతుందో, అలాగే ఈ పరివర్తన కూడా జరుగుతుంది, అందుకే స్మృతిని జ్వాలా రూపము అని అంటారు.

స్లోగన్:- ఎవరైతే ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు శీతల స్వరూపాన్ని మరియు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు జ్వాలా రూపాన్ని ధారణ చేయగలరో, వారే శక్తిశాలి ఆత్మ.